# ఎక్స్ రే కళ్లు

సీతాయి నవ్వు చూసి చూసి రాఘవులకి ఉడుకుమోత్తనమే వచ్చింది.

"ఎంత బాగుందే సీతీ, సిగ్గులేని నవ్వూ. ఓ హో హో!"

మాటల్లో సీతాయేనా తక్కువ తిన్నదీ? నవ్వుతూనే అప్పజెప్పింది.

"ఎంత బాగుందిరా, మాఁవా? మూరెడైతే ముక్కూ, ముక్కు నిండా కోపమూ, ఆ హా హా!"

"ఏటే యిరగపాటూ? మూస్తావా, మూతి రిసి సేతిలో పెట్టమన్నావా?"

సీతాయి ఊరుకోలేదు. సెలయేటి గలగలా, అందులో రాత్రివేళ ప్రతిఫలించే నక్షత్రాల మిలమిలా ఏకమైనట్లు అలా నవ్వుతూనే ఉంది.

"నువ్వే టనుకుంటే అనుకో. జరిగిందే యిసిత్రం. దానిమీద అగ్గై పోతున్న నీ మొగం సూత్తాంటే కడుపుబ్బిపోతోంది అనుకో". సన్నని తుంపర పడినట్టు, చక్కని పువ్వులు రాలినట్టు సీతాయి మరొక్కసారి నవ్వింది. ఎండలో తారురోడ్డు మెరిసినట్టు ఆ సన్నని వెన్నెట్లో ఆమె నల్లని బుగ్గలు మిలమిలా మెరిశాయి. ఇక నవ్వలేక యిసకలో కూల పడింది. ఆయాసం వచ్చింది. దగ్గుకి లంకించుకుంది.

"ఛస్ పెంకినాయాలా, సెబితే యినవు. డాటరు యిలా దగ్గకూడ దన్నాడా? నీకేటన్నా రోగమొస్తే నే ఎలా సచ్చేది సెప్పూ?"

రాఘవులి కళ్ళలో విచారం మెదిలింది. సీతాయి తన దగ్గరున్నంత కాలం తన కేమొచ్చినా మరేం ఫరవా లేదు. దాన్ని చేసుకున్న ముహూర్తం అలాంటిది. దాని అందం అలాంటిది. అన్నిటినీ మించి దాని మనసు అలాంటిది.

అయిదు నిముషాలు టైమిస్తే చాలు. పెంటకుప్పలాంటి గుడిసె తాజమహలు చెయ్యగలదు. క్షణమాత్రం సమయముంటే చాలు, మండి పోతున్న మనస్సులో మధుర మకరందాలు చిలకరించగలదు. దాని తెలివి తేటలు అలాంటివి. 'ఇది లేకపోతే నే నేమైపోతానూ?' అని వాడు రోజుకు వందలసార్లైనా అనుకుంటాడు. అసలు అదే అలాంటిది.

దానిది పూర్తిగా ఎదిగిన శరీరం. పూర్తిగా వికసించిన సౌందర్యం. రోగాలూ, బాధలూ దానికి ఆమడ దూరంలో ఉంటాయి. అంత ఆరోగ్యంగాఉన్న సీతాయి ఓనాటి సాయంకాలం 'ఖంగు, ఖంగు' మని దగ్గడం ప్రారంభించింది. రెండురోజులైనా దాని దగ్గు తగ్గలేదు. ధర్మాసుపత్రికి తీసికెళ్ళాడు. ఆ మందుతో దానికి దగ్గు ఎక్కువై పోయింది.

"ఇదేటోలమ్మ, యీ మాయముండా రోగం?''

"పోనీ డాటరు సెలపతి దగ్గిరికి తీసికెల్లనేటే?"

"ఒల్లకుందూ. అదే పోద్ది''

ఊరుకుంటే మాత్రం అదిపోలేదు, డాక్టరు చలపతిదగ్గిరకి తీసికెళ్ళక తప్పనూ లేదు!

''ఎప్పుడొస్తుందేం దగ్గు?''

"రాత్రిపూట ఎక్కువబాబూ! మా బాద పడిపోతాంది. మంచి మంది య్యండి దొరా."

"ఇలా ఎన్నాళ్ళనుంచీ?"

"ఎక్కడ, యిరవై ముప్పై రోజు లయిపోనాది బాబుగారూ."

డాక్టరు ఆలోచించాడు. సీతాయిని పరీక్ష చేశాడు.

''పైకేం కనిపించదు మరి. ఇవిగో యీ మాత్ర లిస్తున్నాను. వారం రోజుల్లో మళ్ళీ రండి."

వారం రోజులకికూడా సీతాయి దగ్గేం తగ్గలేదు.

"ఇలా ఎక్కువరోజులు ఉంచడం మంచిదికాదు. దగ్గు ఎక్కువై ముదిరిపోతే మనవల్లగాదు. ఊళ్ళో క్షయకేసులు ఎక్కువగా ఉన్నాయి. వెంటనే నీ భార్యాని విశాఖపట్నం తీసికెళ్ళి ఎక్సరే తీయించు" అన్నాడు డాక్టరు. ఆ రాత్రి రాఘవులికి నిద్రపట్టలేదు. సీతాయిమాత్రం నిద్ర పోతోంది. అది కలక్టరుగారింట్లో అంట్లూ చెంబులూ తోముతుంది. బోలెడంత పైపని చేస్తుంది. ఒళ్ళు అలసి ఉంటుందేమో అదిక రాత్రి మనలోకంలో ఉండదు.

నిద్రపోతున్న సీతాయి బుగ్గమీద ముద్దుపెట్టుకున్నాడు రాఘవులు. అతని కళ్ళమ్మట గిర్రున నీరు తిరిగింది. ఎదురింటి సోవన్న ఏమయ్యాడు? క్షయ పట్టుకుందన్నారు. పిడుగులాంటి మనిషయితేమాత్రం? రోగం పీల్చేసింది. రక్తం కక్కుకు చచ్చిపోయాడు. తన సీతాయి? ఈ వెర్రిది లేకపోతే త నేంకాను? తనకి సైకిలుషాపులో ఉద్యోగం దొరికిన్నాడు రూపాయీ అర్ధా దొరుకుతుంది. లేనినాడు లేదు. ఉన్నా లేకపోయినా నిండుకుండలాంటి మనిషి సీతాయి. ఎక్కడ్నించి తెచ్చిపెట్టేదో, ఎలా పెట్టేదో కూడులోకి పప్పుపులుసూ, నంచుకుందికి వొంజరాలూ లేని రోజే లేదు! అలాంటి దీన్ని విశాఖపట్నం ఎలా తీసికెళ్ళడం? ఫొటోలు అవీ ఎలా ఎత్తించడం?

తెగిపోయిన మంచి ముత్యాలహారంలా, చల్లగాలికి రాలే పారిజాత పువ్వుల్లా సీతాయి మళ్ళీ నవ్వింది. ఈసారి రాఘవులికి కోపం ఆగలేదు.

"ఒసే, యీసారి నువ్వు పళ్ళు యికిలించాలి, నే న్నిన్నిలా ఎత్తి ఏట్లో యిసిరెయ్యకపోతే అడుగు."

"అబ్బోసి అబ్బోసి అంత పాటోడివే? కాత్త ఆలస్యమయితే రాములోరు సీతమ్మని ఎతికినట్టు ఎతకడమేగాని!" రాఘవులికోపం యీ మాటలతో విరిగిపోయింది. వాడు రాజీకి దిగక తప్పలేదు. రెండు

చేతులతోనూ దాని భుజాల్ని పట్టుకుని బలవంతాన తనవైపు తిప్పుకుని అన్నాడు.

''సూడాసే సీతాయ్ ! పొద్దుటనగా పన్లోకిపోయావ్ ! మజ్జాన్న మయినా రాలేదు. కొట్లో పనుండమట్టి నా న్రాలేకపోయా. యింతసేపూ ఏటయిపోనావ్ ? సెప్పేహే''

''ఈపొద్దు లెగిసి ఏరిమొగం సూశానోగాని బలే యిసిత్రం జరిగి పోనాద్రా మాఁవా ! సా...లా యిసిత్రం!'' సీతాయి తలా కళ్ళూ తిప్పుతూ చెప్పింది.

''ఏటే అదీ ? సెస్పవా, సెప్పవా ?''

''సెప్తా యిను మరీ !''

చల్లని ఏటిగాలి వీస్తోంది. సన్నగా వెన్నెల పడుతోంది. ఆ నిశిలో—ఆ యిసకలో మాఁవవళ్ళో తల పెట్టుకుని పడుకుని—చందమామను చూస్తూ—సీతాయి జరిగినదంతా చక్కని కథలా చెప్పింది.

*  *  *  *

కలక్టరు కనకరాజుగారి చిన్నబ్బాయి సాధారణంగా విశేషణంలేందే వాక్యం వాడడు. వాడు దీపావళికని పిల్లలతో వచ్చిన చిన్నక్కతో అన్నాడు:

"ఈవి డెవరే ? అమ్మ నెయ్యి కాలిపిస్తుందే సోల, ఆ సోలలా మూతీ యీవిడాను ?" ఆ మాటకి చిన్నక్కా, అప్పుడే గదులు తుడుస్తున్న సీతాయీ నవ్వుకున్నారు.

"తప్పు తమ్ముడూ ! ఆవిడ మన కుటుంబాన్ని చిన్నప్పట్నుంచీ..."

"ఓహో ! నరహరిగారితాలూకా ? నాన్న చెప్పేవారూ ?"

ఎవరయినా తన్ని తను పొగుడుకుంటే కనకరాజుగారు అనేవారు,

"మా మిత్రుడున్నాడులే నరహరి అని! ఇలా అనేవాడు 'ఎందుకూ పనికిరాని కొందరు వెర్రివెధవలు నాలాటి బాగా చదువుకున్న వాణ్ణి చూసి ఓర్చలేక ఆత్మస్తుతీ పరనిందా అని నాకు పేర్లు కూడ పెడుతున్నారు. బాగుందా ?" ఆ నరహరిగారు రానే వచ్చారు. కనకరాజుగారితో మాట్లాడు తున్నారు. వచ్చిన ఆవిడ ఆయనభార్యే, సుభద్రమ్మ. ఇద్దరూ ఏదో పెళ్ళికి వెడుతూ యిలా దిగేరుట. చిన్నక్క తమ్ముణ్ణి పిలిచి నవ్వుతూ చెప్పింది:

"విన్నావా తమ్ముడూ, ఆవిడ యిక్కడ తలంటుట !"

"బాగుంది. ఓ మంగలాణ్ణికూడా పిల్చుకొస్తాను. ఆయనగాని క్షవరం చేయించుకుంటాడేమో !" అమ్మ యీ మాటలు విని కోప్పడింది:

"పోనిద్దూ ఓరే. మీ కాలంలో అలాగే చేద్దురుగాని. ఎప్పుడనగా నీళ్ళోసుకుందో చనువుకొద్దీ అడిగింది"

"ఎప్పుడనగా విందో నలుగుపాటకూడా పాడితే సరి!" అమ్మ. చిన్నక్కవైపు చురచుర చూస్తూ వెళ్ళిపోయింది. అక్కా తమ్ముడూ నవ్వుకున్నారు.

అరగంట గడిచింది. వీధిలో కనకరాజుగారూ, నరహరీ కబుర్లు చెప్పుకుంటున్నారు. చిన్నక్క పిల్లలిద్దరూ అంతసేపూ వీధిలో ఆడుకుని అప్పుడే యింట్లోకి వచ్చేశారు. రాగానే చిన్నక్క 'బంతేదర్రా ?' అని అడిగింది. పిల్లలిద్దరూ ఒహరి మొహాలు ఒకరు చూసుకున్నారు. ఏదీ బంతి ? ఎక్కడ పోయిందో !

"మా పిల్లలయితేనా ? హు! ఇలా చేత్తో చిల్లిగవ్వ పారెయ్యరు" అని నరహరిగారు యింకా ఏదో చెప్పబోతూనే ఉన్నారు. లోపల్నుంచి పిలుపు వచ్చింది.

"ఏమండోయ్, నా చేతి వజ్రపు ఉంగరం పోయినట్టుంది!" అంది సుభద్రమ్మ వణుకుతూ. ఎలా పోయింది ? ఎక్కడ పోయింది ? ఎలా

ఉంటుంది ? ఎంత ఖరీదుది ? క్షణంలో అందరూ అక్కడచేరి అడిగిన ప్రశ్నలు యివి.

అప్పటికి పదేళ్ళ క్రితం నరహరిగారు మెడ్రాసులో కొన్న మేలిరకం వజ్రంట అది. ప్రస్తుతం దాన్ని నాలుగువందలు ఉంటుందట. సుభద్రమ్మ గారు తలంటుకుముందు అన్ని వస్తువులూ తీసి బాల్చీలో పడేశారుట. తలంటుకొన్నాక వస్తువులన్నీ తువ్వాలులో కట్టి వంటింట్లోకి వచ్చి బట్ట మార్చుకుని ఒక్కొక్కటీ పెట్టుకుంటూ ంటే అన్నీ ఉన్నాయట గాని వజ్రపు ఉంగరం లేదుట.

"వెధవ అశ్రద్ధ! వెతుకు చచ్చినట్టు!" అని విసుక్కున్నారు నరహరి గారు. అమ్మ, దగ్గిరుండి రెండుసార్లు నీళ్ళగది కడిగించింది. ఆ కాలవంతా వెతికేరు. కొబ్బరిచెట్టు మొదట్లో చూశారు. నీళ్ళకాగు, గంగాళం, బాల్చీ అన్నీ గాలించారు. వజ్రపు ఉంగరం ఎక్కడా కనబడలేదు. అందరి కళ్ళూ అల్లంత దూరంలో అంట్లు తోముతున్న సీతాయిపై పడ్డాయి. 'ఇంకేం దీని పనే అయిఉంటుంది.' అని నిశ్చయానికి వచ్చారు అందరూను.

"అలా ఒక్కసారి మనం ఏం చెప్పెయ్యగలమూ? సొమ్ము పోయినవాళ్ల పాపాన్ని బోదురని...ఒట్టి అనుమానాన్నే మనం ఎలా నిర్ధారణ చెయ్య గలమూ ?" అన్నారు కనకరాజుగారు. పిల్లలదగ్గిర్నుంచి పెద్దవాళ్ళవరకూ అందరూ వెతుకుతూనే ఉన్నారు. సుభద్రమ్మగారు చీర మార్చినచోటా, వస్తువులు కడిగినచోటా పెట్టుకున్నచోటా అంతా వెతికేరు. ఉంగరంలేదు.

"నేను వస్తువులు తీసినప్పుడూ, కడిగినప్పుడూ కూడా సీతాయి ఉంది. తరవాత నీళ్ళగది కడిగిందీ అదే. దాని పనే. మరేం సందేహంలేదు. గట్టిగా అడిగి చూడండి వదినా" అంది సుభద్రమ్మ అమ్మతో.

"ఎందుకు సీతాయ్ అక్కర్లేని అల్లరీ ? కడుపు మాడిందీ, కళ్లబడిందీ ఏదో కక్కుర్తి పడ్డావు. చల్ల చల్లగా యిచ్చెయ్". సీతాయి పాచిచేతులు కడుక్కుని వణుకుతూ వచ్చింది.

"అదేటమ్మగోరూ, ఆరేళ్లమట్టి ఉన్నాను. పూసికపుల్ల ముట్టుకుని ఎరుగుదునా, మీరే యిట్టా అంటారేటమ్మగోరూ..."

"ఒసే, యింక ఆవేషాలన్నీ కట్టిపెట్టు, ఇంట్లో నువ్వుతప్ప మరొకరు లేరు—మనయింట్లో వస్తువయితే ఫరవాలేదు. ఆవిడ పరాయిదీ, ఏదో చుట్టపుచూపుగా వచ్చింది. ఏం బాగుంటాయి ధనహానీ, లోకనిందా పనులూ ? ఎక్కడ పెట్టేవు చెప్పు ?"

"మీరేసిన ఒట్టమ్మగోరూ — నేనే పాపం ఎరుగను — ఆ రెక్కడెట్టు కున్నారో యేటో !" సీతాయి కళ్ళమ్మట నీళ్లు తిరిగేయి.

"ఇవాళ లేచినవేళ అలాంటిది వదినా! నేనేం చిన్నదాన్నా? చితకదాన్నా ఇన్నిమాటలు పడవలసివస్తోంది"సుభద్రమ్మగారు వీధిలో నాన్ననిఉద్దేశించి అన్నమాటలు అవి. కనకరాజుగారి తత్వం ఒకటే. ఏదైనా వస్తువు పోయింది అనుకోండి. ఎందుకు జాగ్రత్తగా ఉన్నారు కారూ ? చచ్చినట్టు అనుభవించండి...దీనిమాట యిలా ఉంచి ఏదైనా జబ్బువచ్చినా ఆయన అంతే. ఎందుకు తెచ్చుకున్నారూ ? భరించడి !

"ఆయన వాలకమే అంత. మీరూఁ కష్టపెట్టుకోకండి వదినా ? ఎక్కడికి పోతుంది యింట్లోవస్తువ ? ఇవాళ యిదయింది రేపు మరోటవు తుంది. సీతాయ్ ? ఇంక నువ్వు అల్లరిపడి మమ్మల్ని అల్లరిపెట్టకు. ఒకటీ రెండూకాదు అయిదొందల వస్తువ. నువ్వు అమ్ముకుంటే పది రూపాయల కడుగుతారు. పది నే యిస్తా యిచ్చెయ్."

సీతాయి కళ్ళ నీళ్ళని ఎడం చేత్తో తుడుచుకుంది. వినయం, విశ్వాసం తప్ప మరొకటి ఎరగని ఆమె మనస్సు తల్లడిల్లిపోయింది. అలా నిలబడి పోయింది.

"అయితే యివ్వవన్న మాట ?"

"నేనా వస్తువుని కళ్ళతోటే సూసెరగనమ్మగోరూ !"

"నీకు మంచిమాటలతో లాభంలేదు. వస్తువు నీ దగ్గిర్నుంచి ఎలా తెచ్చుకోవాలో మాకు తెలుసు, పద పోలీసు స్టేషనుకి."

"అమ్మో, అమ్మో !" సీతాయి వెక్కి వెక్కి ఏడ్చింది. రెండుచేతులూ తలమీద పెట్టుకుని నారింజ చెట్టు క్రింద, అంట్లగిన్నెల ప్రక్క కూలబడింది.

* * * *

రాఘవులు హఠాత్తుగా లేచి కూర్చున్నాడు. సీతాయి తల యిసకలో పడింది. వాడి గుండె గట్టిగా కొట్టుకోడం, పెదవులు వణకడం అది స్పష్టంగా చూసింది. 'అయ్యో తన గురించే కదా మావ యింత బాధపడు తున్నాడూ' అని ఊరుకోవచ్చునా ? ఉహుఁ అలా చెయ్యలేదు. ఇసకపడిన ఆ చింపిరితలను గోక్కుంటూ మళ్ళీ నవ్వింది. వెన్నెల్లో దానిపళ్ళు మిల మిలా మెరిశాయి. ఆ నవ్వు ఒక్క నోట్లోంచే రాలేదు. దాని పెదవులు, కళ్ళు,...దాని హృదయం...అన్నీ నవ్వేయి.

"ఓసి నీ సిగ్గు సిరగా ! నీ సిగ తరగా : ఏటే గుండెలమీద కుంప టుంచుకుని నీకు నవ్వేలా వస్తోందే ?...ని...న్ను."

"అదిగదే తమాసా. సెప్తాను యినుకోమరి." సీతాయి కథ పూర్తి చేసింది.

* * * *

"ఇవాళ భోజనాలూ, బొట్లూ లేవా ఏమిటి? పదండి భోంచేసి మాట్లాడు కుందాం" అమ్మ తొందరపెట్టింది. అక్కయ్య పిల్లలు అంతకుముందే తినేశారు. మొగాళ్ళు భోజనానికొచ్చారు. భోంచేస్తూ కనకరాజుగా రన్నారు.

"ఆరేళ్ళ బట్టి చేస్తోంది. ఇల్లు—ముసిల్దయిన మా అమ్మకీ దానికీ వదిలేసి మేమంతా పెళ్లిళ్ళకి సహా వచ్చేసేవాళ్ళం...అలాంటిది అది తీసిందంటే ఆశ్చర్యంగానే ఉంది."

''ఈయన యిలాగే అంటారు. ఈయనవల్ల ఏ పనీ అవదు. మీరు తగిన ప్రయత్నం చేయించండి అన్నయ్యగారూ !" అంది తలుపుచాటు నుంచి అమ్మ.

"అలాగే. అలాగే చేయించండి ప్రయత్నాలు. నాకేం? వెనక యిలాంటి ఆధారంలేని అనుమానపు కేసుల్లో పెద్ద పెద్ద పోలీసు ఆఫీసర్లే డిస్మిస్ అయ్యేరు.''

కాస్సేపు ఎవరూ మాట్లాడలేదు. నాన్న భోంచేసి వెళ్ళిపోయారు.

''ఇలాంటివి పోలీసులకి అప్పజెప్పకుండా యుక్తిగా పరిష్కరించడం మంచిది. ఇలారా సుభద్రా? అసలు నీకు వస్తువ ఎక్కడ వదిలేసినట్టుందీ, సరిగ్గా చెప్పు."

ఆవిడ భర్త ఎదురుగుండా వచ్చి అంతా మళ్ళీ చెప్పింది :

''చూడండీ, నేను బాల్చీలోంచి వస్తువులన్నీ తీశానని అనుకున్నాను. ఉంగరం అందులోనే మరచిపోయానని నా నమ్మకం. అది సీతాయి చేతిలోనే పడింది.''

''సందేహం లేదు'' అని కలిపింది అమ్మ.

"తీసిన ఉంగరం ఏం చేసిందంటారూ ?"

"దాని దగ్గిర బాగా వెతికేం. లేదు మరి."

అదేమిటి వదినా, సత్తెకాలం మాటలాడతారూ ? 'ఇంత చెరువుంది, నీటికి కరువా ?' అని యింత పెరట్లో అదెక్కడ పాతిపెట్టిందో ఎవరు చెప్పగలరూ ?"

హఠాత్తుగా వంటింట్లోంచి మామ్మ యివతలికొచ్చింది :

''సుభద్ర నీళ్ళోసుకు వెళ్ళిం తరవాత అది నీళ్ళ గది యివతలకి రాలేదు. నేను చూశా."

"మీరెక్కడ చూశారూ ?''

''సుభద్ర నీళ్ళోసుకుని యివతలకి వస్తూంటే నేను మడిగట్టుకుందామని నూతి దగ్గిరకు వెళ్ళేను. ఆ తరవాతే సీతాయి నీళ్ళగది కడగడానికి వెళ్ళింది. అది యింకా కడుగుతూనే ఉంది. వస్తువు పోయినట్టు సుభద్ర యివతలకి రానేవచ్చింది. వెంటనే దాని దగ్గర చూడనే చూశాం. అది యివతలకొచ్చి పాతిపెట్టడానికి పైమేదే ?''

సీతాయి ఉంగరం తీసిందా లేదా ? తీస్తే ఎక్కడ పెట్టింది, ఏం చేసింది ?

"మరోసారి ఉంగరం ఉందో లేదో వెతుక్కోండి — నేను ఏమయిందో చెప్పేస్తాను" మళ్ళీ మళ్ళీ తెగవెతికారు. ఇల్లంతా కడిగించారు. ఎక్కడా ఉంగరం లేదు.

"పొద్దెక్కి పోనాది, మా మాఁవ నా కోసం సూస్తాఉంటాడు. నన్ను తోలెయ్యండి అమ్మగారూ !" పెరట్లోంచి సీతాయి కేకేసింది.

"చూశారా ఎలా తొందరపడుతోందో ? సందేహం లేదు. ఇదే'' అన్నాడాయన.

"ఏం చేసిందీ ?"

"మింగేసింది !" అందరి ఆశ్చర్యానికీ అంతులేక పోయింది. గొప్ప విజయం సాధించినట్టు నవ్య సత్యం కనిపెట్టినట్టు నరహరిగారు మొదలు పెట్టేరు.

"మునపటి కాలమా యిది ? కమ్యూనిష్టు కాలం ! పని వాళ్ళకున్న తెలివి తేటలు యజమానులకు లేవు. అలా ఉందిగాని, అమ్మా ! సీతాయి తక్కువదా ?"

"వజ్రంగదా, మింగితే చావదూ ?"

"అంతమటుకు దానికేం తెలుసూ ? అయినా వజ్రం వేరే లేదుగా ? ఎలాగో మింగింది. అలా పోతే ఏ బాధా లేదనుకుంది !"

"సరే. అది మింగిందే అనుకోండి — మనమేం చెయ్యగలమూ ?"

"ఇక్కడే మొగాళ్ళకీ ఆడాళ్ళకీ తేడా...కాదు...కాదు...తెలివైన వాళ్ళకీ లేని వాళ్ళకీ తేడా...చెప్పుకోండి చూద్దాం ఏం చెయ్యగలమో !"

ఎవ్వరూ మాట్లాడలేదు. నరహరిగారు ఏం చెయ్యాలో చెప్పేరు.

అయిదువందల వస్తువు. కొద్ది శ్రమా, కాస్త ఖర్చు అయినా తప్పదు. ఉంగరం దొరకడం కావలసింది.

ఇంక చెప్పవలసింది ఏముందీ ? బలవంతానా సీతాయిని బండి ఎక్కించారు. మరో మనిషి సాయంతో — నరహరిగారు సీతాయితో విశాఖపట్నం చేరుకున్నారు. తిన్నగా హాస్పిటలు చేరుకుని 'ఎక్స్‌రే' వార్డుకి వెళ్ళేరు. ఆయనికి కాస్త పరిచయమున్న డాక్టర్ని పట్టుకున్నారు.

"మునుపట్లా మాకూ 'ఫ్రీ'గా కుదరడం లేదండీ ! సొమ్ము చెల్లించాలి" అన్నాడాయన. నరహరిగారికి సుభద్రమీద చెప్పలేనంత కోపం వచ్చింది. వెధవ అశ్రద్ధలు ! బోలెడంత ఖర్చూ, అనవసరంగా శ్రమా !

"ఏమిటండీ జబ్బూ ? ఎక్కడ ట్రేస్ చెయ్యాలీ ?"

"అది తెలీకే గదండీ యిక్కడికి తీసుకొస్తా ? అన్నవాహిక అంతా గాలించండి బాబూ ! దానికి తగిన సొమ్ము నే నిస్తా...ఆ చేత్తో గుండెలు కూడా చూడండి. ఎక్కడికి పోయిందో ఏం చెప్పగలమూ — ఆ లోపల అడవి తీగెల్లా అల్లుకుపోయి ఉంటాయంటారు ?" అన్నారు నరహరిగారు. డాక్టరు నవ్వుతూ అన్నాడు :

"ఇంచుమించు థరో ఎక్సురే అందురూ ! పాతిక రూపాయలు చెల్లించండి."

నరహరిగారు — వస్తువు మరోచోట కాణీ చవక అంటే మైళ్ళకొద్ది కాలినడక నడిచే నరహరిగారు — భార్యని శపిస్తూ ఎదురుగుండా నిలబడిన సీతాయిని చూపులతో దహిస్తూ — పాతికా తీసి వైద్యుడి చేతిలో పెట్టేరు.

సీతాయి సంగతి గ్రహించేసింది. ఫోటో తీస్తే కడుపులో ఏముందో కూడా డాక్టరు చెప్పగలరని ఆమె ఓసారి వింది. 'తను ఉంగరం తిన్నానని' మాట వినగానే ఆమెకు చెప్పలేనంత నవ్వు వచ్చింది. ఈ నవ్వులో ఆమెకు దగ్గు వచ్చింది. ఆమెకు తన దగ్గు సంగతీ, డాక్టరు చలపతి సలహా జ్ఞాపకం వచ్చేయి.

ఇద్దరు నర్సులు ఆమెను గదిలోకి తీసుకెళ్ళి బల్లమీద పడుకోపెట్టేరు ఒకమూల. తెలివైన సీతాయి ఊరుకోలేదు !

''సూశారుగా, బాబుగార్ని ? నానంటే సెడ్డ అభిమానం. వద్దంటున్నా బలిమిని తీసుకొచ్చేరు. వయసుమీరి అసలు సంగతి యాదమరిచారు. నాకు గుండెల్లో జబ్బు నర్సమ్మలూ ! దగ్గు విన్నారుగా ?...''

రాఘవులు ఊరుకోలేదు. పకపక నవ్వుతూ దాని బుగ్గమీద ఒకటి చరిచి ''ప పస్ పెంకినాయాల! కానీ ఖర్చులేకుండా యిశాకపట్నం ఎల్లొచ్చేసినావ్ !''

"అంతేకాదు. శాన్నాల్నుంచీ అనుకుంటున్నా. అక్కని సూశ్శేదని. అదీ పిల్లలూ అక్కడే ఉన్నారు. సూశా..."

"సరే అసలు సంగతి సెప్పు. సూ సేమన్నారు ?"

"ఏటుంది గనక ? మన భయమే......ఏట్లేదన్నారంట."

రాఘవులి బుర్రమీంచి కొండంత బరువు తగ్గింది. తన సీతాయి కే జబ్బూలేదు ! తన కింకేం బాధాలేదు ! ఎంత అదృష్టం !

'మరి ఉంగర మేటయిందంట ?'

"ఊర్నుంచి రాగానే సిన్నమ్మాయిగోరు సెప్పినారు. ఆ సుబద్రయమ్మ కొంగునే ఉండదంట. ఆ సీరమార్చేసి అడలిపోనారంట !''

సీతాయి కిలకిల నవ్వింది. రాఘవులు పకపక నవ్వేడు. ఇద్దరూ కలసి గట్టిగా...ఘాట్టిగా నవ్వేరు !